సర్వే పనుల వేగవంతానికి చర్యలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ రోళ్ల వాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల్లో భాగంగా అటవీ ముంపు భూముల సర్వే వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అటవీ ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముంపునకు గురవుతున్న దాదాపు 900 ఎకరాల అటవీ భూములకు బదులు పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో రెవెన్యూ భూములు అప్పగించనున్నామని, ప్రస్తుతం అటవీ ముంపు భూములలో ఇప్పటి వరకు 33 వేల చెట్లు ఉన్నట్లు లెక్కించినట్లు పేర్కొన్నారు. అనంతరం బీర్‌పూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించి పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే బోధన అందించాలని, మౌలిక వసతులు, సమయ పాలనపై అడిగి తెలుసుకున్నారు. డీఎఫ్‌వో రవి ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్, డీఈఈ చక్రునాయక్, తహసీల్దార్ సమీర్, రేంజర్ శ్రీనాథ్, డీఆర్వో రవి కుమార్, ఎంపీవో రామక్రిష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.


అటవీ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

అర్బన్ కాలనీ పరిశీలన

జగిత్యాల: నూకపల్లి రెండు పడక గదుల అర్బన్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కాలనీని పరిశీలించారు. మురుగుకాలువలు, విద్యుత్తు సౌకర్యం, నీటి వసతి, రహదారి పనులకు ప్రభుత్వం రూ.32.26 కోట్లు మంజూరు చేసిందని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, తహసీల్దార్ రాంమోహన్, కమిషనర్ చిరంజీవి, ఈఈలు రహమాన్, శేఖర్‌రెడ్డి, డీఈఈ రాజేశ్వర్ తదితరులున్నారు.

జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం: హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచన ప్రకారం జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉందని పొలాస పరిశోధనస్థానం సాంకేతిక అధికారిణి బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలోతేమ 42-89 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 21-22, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు అవుతాయని వివరించారు.

కాస్మొటిక్ కిట్లు రాలే!

గురుకుల విద్యార్థులకు తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

పేద కుటుంబాలకు చెందిన బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయి. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 లక్షల వరకు వెచ్చిస్తున్నా తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. అద్దె భవనాల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోగా కనీసం నిత్యావసరాల విషయంలో నిర్లక్ష్యంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

బాలురు 928... బాలికలు 771

జిల్లాలో 5 మైనారిటీ గురుకుల పాఠశాలలు, అనుబంధంగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జగిత్యాలలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 349 మంది, జగిత్యాల బాలికల గురుకుల పాఠశాలలో 404 మంది, కోరుట్లలో 281, మెట్‌పల్లిలో 298, ధర్మపురిలో 367 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 928 మంది, బాలికలు 771 మంది విద్యనభ్యసిస్తున్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రతి 3 నెలలకు ఒకసారి కాస్మొటిక్ కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇందులో 2 దువ్వెనలు, 1 టూత్ బ్రష్, టూత్ పేస్టులు చిన్నవి 3, కొబ్బరి నూనె బాటిల్, ఫేస్ పౌడర్ చిన్నవి 3, స్నానపు సబ్బులు, బట్టల సబ్బు 1 ఉంటాయి. ప్రత్యేకంగా దోబీ గురుకులానికి వచ్చి దుస్తులు ఉతకడంతో ఒక సబ్బు 3 నెలలకు సరిపడుతుండగా, స్నానపు సబ్బు ఒక్కరికి 15 రోజులకు కూడా సరిపడటం లేదు. అయితే 3 నెలలకు ఒకసారి సరఫరా చేసే కాస్మొటిక్ కిట్లు ఏడాదిన్నర నుంచి రావడం లేదు. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో కిట్లు సరఫరా కాగా ఆ తరువాత నుంచి కాస్మొటిక్ కిట్ల ఊసే లేకుండా పోయింది.

మైదానాలు ఎక్కడ?

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, ఆరోగ్యం, సోదరభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా మైనారిటీ గురుకుల పాఠశాలల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు సరఫరా చేస్తోంది. ఇందులో క్రీడా పరికరాలతో పాటు, బూట్లు, సాక్సులు, సమదుస్తులు అందచేస్తోంది. ప్రతి పాఠశాలలోనూ వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, అద్దె భవనాల్లో గురుకులాలు నిర్వహిస్తుండటంతో మైదానాలు మాత్రం అందుబాటులో లేవు. దీంతో సెలవు దినాల్లో మైదానానికి తీసుకెళ్లి ఆటలు ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది.



జగిత్యాలలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల

ప్రభుత్వానికి నివేదించాం

- డాక్టర్ రాజేందర్, ఆర్ఎల్‌సీ

కాస్మొటిక్ కిట్లు సరఫరా కాని విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్లు ఇప్పటికే సరఫరా కాగా విద్యార్థులకు పంపిణీ చేశాం. కాస్మొటిక్ కిట్లు, బాలికల అవసరాలకు సంబంధించినవి కూడా సరఫరా కాగానే విద్యార్థులకు అందచేస్తాం.



కాస్మొటిక్ కిట్లతో పాటు బాలికలకు ప్యాడ్లు సైతం సరఫరా చేయడం లేదు. దీంతో ప్రతి నెలా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా అనారోగ్యం బారిన పడే అవకాశాలకు తావిస్తోంది. ప్రతి పాఠశాల, కళాశాలలో చదువుతున్న కిశోర బాలికలకు ప్యాడ్లు గతంలో క్రమం తప్పకుండా 3 నెలలకు ఒకసారి వచ్చేవి. ఇందులో ఒక్కో ప్యాకెట్‌లో 3 ప్యాడ్లు ఉంటుండగా, మూడు నెలలు సరిపోయేవి. ఈ ఏడాది ప్రత్యేకంగా చిత్రలేఖనం కోసం కిట్లు సరఫరా చేసిన ప్రభుత్వం, ప్యాడ్లు పంపిణీ చేయకపోవడం విస్మయం కలిగిస్తోంది.

స్థల పంచాయితీ

ఒక్కో గ్రామానికి రెండేసి కొనుగోలు కేంద్రాల మంజూరు

■ సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామంలో కొంత కాలంగా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోకి డీసీఎంఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామంలో వివాదం నెలకొంది. రైతులతో కలిసి నిర్వాహకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన స్థలంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రాన్ని మంజూరు చేయడంతో స్థల విషయంలో ఇరు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. కేవలం ఇక్కడే కాకుండా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య నెలకొంది. అయితే కొన్ని కేంద్రాలను అధికారులు కుదించినప్పటికీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు మళ్లీ మంజూరు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

న్యూస్‌టుడే, సారంగాపూర్

ఒక్కో గ్రామానికి రెండేసి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయడం.. ఉన్న కేంద్రానికి సరైన స్థలం లేకపోవడంతో మరో కొనుగోలు కేంద్రాన్ని కేటాయించడంతో గ్రామాల్లో వివాదాలు నెలకొంటున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలకు గానూ జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ ద్వారా 175, సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లకు 251, మెప్మా ద్వారా ఒక కొనుగోలు కేంద్రం అప్పగించారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో సేకరణ వేగవంతం అవుతున్నప్పటికీ స్థలాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది.

నిర్వాహకులకు తాఖీదులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి వచ్చే కమీషన్‌లో సగానికిపైగా నిర్వహణకు వ్యయం చేయడంతో జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒక్కో కేంద్రంలో కనీసం 5 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసినప్పుడే నిర్వహణ వ్యయం తగ్గి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే పలు కొనుగోలు కేంద్రాలలో 2 నుంచి 3 వేల క్వింటాళ్ల సేకరణ దాటకపోవడంతో ఆయా కొనుగోలు కేంద్రాలకు నిర్వహణ వ్యయం పెరిగి నష్టాలు వస్తున్నాయి. అంతేకాకుండా కొన్నేళ్లుగా కమీషన్ పెంచకపోవడం.. వ్యయ ఖర్చులు పెరగడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

వసతులు కరవు

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేకపోవడంతో పంట పొలాలు, రహదారుల వెంట ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. వానాకాలం తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలం ఎక్కువగా అవసరం ఉండడమే కాకుండా ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని ఉంచాల్సిన పరిస్థితితో స్థలాల సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పంట పొలాల్లో ఆరబెట్టుకునేందుకు ధాన్యం పోసినప్పుడు వర్షాలు పడితే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ పెంచి కొనుగోళ్లు వేగవంతం చేసినప్పుడే సమస్యలు రాకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.

ఎస్సారెస్పీలో గరిష్ఠ స్థాయి నీటినిల్వ

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రం వరకు 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్టులోకి 12,754 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతుండగా కాకతీయ కాలువకు 5,800, వరద కాలువకు 5వేలు, విద్యుత్తు ఉత్పత్తికి 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

చక్కెర పరిశ్రమలను తెరిపించి రైతులను ఆదుకుంటాం

మల్లాపూర్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండో స్థానంలో నిలిచిన నిజాం చక్కెర పరిశ్రమలను నష్టాల నెపంతో మూసివేయడమే కాకుండా, రైతులు, కార్మికుల జీవితాలతో భారాస ప్రభుత్వం చెలగాటమాడిందని, మూసివేసిన పరిశ్రమలను తిరిగి తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మల్లాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి విప్ లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుందని విప్ లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తును అందించిన ఘనత మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నూతన పాలకవర్గ ఛైర్మన్‌గా అంతడుపుల పుష్పలత, వైస్ ఛైర్మన్‌గా ఇట్టేడి నారాయణరెడ్డి, పాలకవర్గ సభ్యులతో మార్కెట్ కమిటీ ఏడీ ప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ శ్రీనివాస్ వేదికపై విప్ లక్ష్మణ్‌కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

జగిత్యాల 94400 23123

కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

పెగడపల్లి, న్యూస్‌టుడే

? పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిసర ప్రాంతంలో కొద్ది రోజులుగా విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తోంది. విద్యుత్తు ఉపకరణాలు కాలిపోతున్నాయి. -రమేశ్, పెగడపల్లి

✓ పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం- వెంకట్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ

న్యూస్‌టుడే, రాయికల్ పట్టణం

? పట్టణంలోని మూడో వార్డు అశోక్‌నగర్‌లో సీసీ రహదారి ఉన్నా కాల్వలు లేకపోవడంతో మురుగు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. - దాసరి శ్రీనివాస్, మూడోవార్డు, రాయికల్

✓ పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే దశల వారీగా పనులు చేపడతాం.- జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

? టీచర్స్‌కాలనీలో మురుగుకాల్వలు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీనివాస్, గంగాధర్, టీచర్స్‌కాలనీ

✓ టీయూఎఫ్ఐడీయస్ నిధులు కేటాయించాం. విడుదల కాగానే పనులు చేపడతాం. -మోహన్, కమిషనర్ మెట్‌పల్లి

రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవ్‌కు ఎంపిక



యోగాలో ఎంపికైన విద్యార్థులు



జానపద దప్పు నృత్యం విద్యార్థులతో గురుకుల ప్రిన్సిపల్


మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవ్‌లో జానపద దప్పు నృత్య పోటీలు, అసోంలో జరగనున్న జాతీయ స్థాయి యోగాలో పాల్గొనడానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మానస తెలిపారు. జానపద దప్పు నృత్య పోటీలకు ఇంటర్ చదువుతున్న ఈ. భవ్యశ్రీ, టి.పూజిత, జె.అక్షిత, ఎస్. ప్రతిభ, కె.అక్షిత, ఎ.శాలిని, డి. రుత్విజ, బి. ప్రవని, జి.రావ్య, ఎం. లహరిక, ఫోక్ సాంగ్ విభాగంలో ఎస్.ప్రతిభ, బి.ప్రవని, ఎన్.లహరిక, జి.రుచిత, ఎ.మీనాక్షి, సోలో విభాగంలో ఎస్.ప్రతిభ, ఎ.లహరి, జి.రుజిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. అసోంలో జరగనున్న జాతీయస్థాయి యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించేందుకు ఉన్నత పాఠశాల విద్యార్థినులు కమలిని, రుత్విజ, డి.సౌజన్య, రుత్విక, మనోజ ఎంపికైనట్లు తెలిపారు.

మత్తడి గోడ నిర్మించరూ..?



కోరుట్ల మద్దుల చెరువు మత్తడి గోడను తొలగించిన దృశ్యం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం లోని మద్దుల చెరువు(మినీ ట్యాంక్ బండ్) మత్తడి, దానిపై ఒక ఎత్తుతో నిర్మించిన గోడను గతేడాది గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించేందుకు బల్దియా అధికారులు కూల్చివేశారు. తర్వాత మత్తడికి మరమ్మతు చేసిన దానిపైనున్న గోడ, ఇనుప రెయిలింగ్ నిర్మించడం మరిచారు. మత్తడిపై ఒక అడుగు ఎత్తున్న గోడను తొలగించడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. గోడ, ఇనుప రెయిలింగ్‌ను నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో చెరువులోని చేపలు వరద నీటికి కింది ప్రాంతానికి కొట్టుకుపోతున్నాయని, ఎవరైనా అదుపుతప్పి చెరువులోపడే ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు.





బాలల మేధస్సు.. భవితకు ఉషస్సు...

'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక కేజీఆర్ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం-సామాజిక మాధ్యమాలతో విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎస్.శ్రీమనోజ్ఞ, బి. మహేశ్వరి, కె.గౌతమ్‌కు ఛైర్మన్ గంగారెడ్డి ప్రశంసాపత్రాలను అందజేశారు. కె.సనత్‌కుమార్, కె.శారద, కె.శ్రీరాం పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

ఏడాది కావస్తున్నా బంగారం ఊసేలేదు



మెట్‌పల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా తులం బంగారం హామీ ఊసే లేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మెట్‌పల్లి పట్టణ శివారులో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణ, మండలానికి చెందిన 70 మందికి రూ.23,62,500 విలువైన సీఎంఆర్ఎఫ్, 139 మందికి రూ.1,39,16,124 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. రుణమాఫీ కోసం రైతులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. పుర వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఒజ్జల శ్రీనివాస్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజ్ కుల సంఘ భవనం ప్రహరీ నిర్మాణానికి భారాస రాజ్యసభ ఎంపీ సురేష్ రెడ్డి రూ.3లక్షలు మంజూరు చేయగా ప్రొసీడింగ్ పత్రాలను సంఘ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. భారాస నాయకులు, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. స్థానికంగా అయిదు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులో నూతన పైపులైన్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. పట్టణంలో రూ.21 కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. గుత్తేదార్లకు బిల్లులు సైతం మంజూరు చేశామని చెప్పారు. వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, గుర్రం రాము పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాను

జగిత్యాల విద్యానగర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ఎం.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల-గొల్లపల్లి రోడ్డులోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలకు 240 సీట్లు కల్పించిన సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో సంజయ్‌కుమార్‌ను శుక్రవారం సత్కరించి సన్మానించారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, వార్డుసభ్యులు పద్మావతి, రాజేశ్, ప్రిన్సిపల్ శ్రీలత, బాలె శంకర్, రాజ్‌కుమార్, నారాయణ, సుధాకర్, శరత్‌రావు, సుమన్‌రావు, బిక్షపతి, ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల-గొల్లపల్లి రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. విద్యానగర్‌కు చెందిన ఏనుగు మనోజ్‌కుమార్(63) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా తుమ్మనపల్లి ప్రవీణ్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మనోజ్‌కుమార్ తలకు బలమైన గాయమై మృతి చెందాడు. మృతుడి మామ గన్నమనేని కరుణాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై మన్మదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

జగిత్యాల: జగిత్యాల ఎల్‌జీరాం లాడ్జి సమీపంలో నక్క రాజశేఖర్‌ను కులం పేరుతో దూషించినందుకు మోత్కూరి శంకర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు. చికెన్ సెంటర్ యజమాని మనోజ్‌కుమార్‌తో మోత్కూరి శంకర్ గొడవ పడుతుండగా నక్క రాజశేఖర్ కారణం అడగగా శంకర్ రాజశేఖర్‌ను కులం పేరుతో దూషించాడని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు యువకుల బైండోవరు

మల్యాల : మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పంచాయతీ కారోబార్‌గా పనిచేస్తున్న రాజేశ్వర్‌రావును గురువారం రాత్రి వెంకటేశ్, ప్రశాంత్, మహేష్ అనే ముగ్గురు యువకులు గొడ్డలితో చంపుతామని బెదిరించిన సంఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. శుక్రవారం ముగ్గురు నిందితులను తహసీల్దారు మునిందర్ ముందు బైండోవరు చేసినట్లు ఎస్సై వివరించారు.

నిర్మాణాలతో ప్రయాణికులకు ఇబ్బందులు



బస్టాండ్ ముందు నిర్మిస్తున్న గద్దెలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయిలో బస్సులు నిలిపే స్థలంలో వివిధ విగ్రహాల నిర్మాణం చేపట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికే ఒక నిర్మాణం పూర్తి చేసుకోగా, మరొకటి నిర్మాణంలో ఉందని, ఇంకో నిర్మాణానికి గుంత తవ్వి ఉంచారని తెలిపారు. బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్టాండ్ నిర్మిస్తే దానికి అడ్డుగా నిర్మాణాలు చేపట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారనుందని, విగ్రహాల నిర్మాణాలు మరోచోటకు మార్చేలా చూడాలని కోరారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన వేదమణి అనే మహిళ అనారోగ్యంతో మరణించగా 2005-06 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు రూ.50వేలను మృతురాలి కూతురు అశ్వేద పేరు మీద పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

పథకాల అమలుతో పేదల కళ్లలో ఆనందం



కొండాపూర్‌లో ఎరువుల గోదామును ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి, న్యూస్‌టుడే: పేదల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో 80 మంది లబ్ధిదారులకు రూ. 13.34 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కొండాపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల గోదాం, వల్లంపల్లి, కొండాపూర్, భీమారం మండలం గోవిందారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొండాపూర్‌లో సీతారామ స్వామి ఆలయం వద్ద సీసీ రహదారి నిర్మాణానికి రూ.83 లక్షలు మంజూరు చేశామన్నారు. మేడిపల్లి, భీమారం మండలాలను అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ వసంత, ఎంపీడీవో పద్మజ, సహకార సంఘం అధ్యక్షుడు ఎం. రవీందర్ రావు, ఏనుగు రమేశ్ రెడ్డి, చేపూరి నాగరాజు, శ్రీపతి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



కార్యకర్తలతో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని అధైర్య పడవద్దని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తలతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ కమిటీలలో నాటి నుంచి పనిచేస్తున్న కార్యకర్తలను నియమించకుండా ఇతరులను నియమించారని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్లుగా పనిచేస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. అనంతరం ఆయనను కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్, మహిపాల్, బాపురపు నర్సయ్య, తలారీ రాజేష్, తదితరులున్నారు.

ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్ల పెంపకం

గొల్లపల్లి, వెల్గటూరు, న్యూస్‌టుడే: గీత కార్మికుల రక్షణ కోసం గతంలోని ఏ ప్రభుత్వాలు ఆలోచన చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌లోని గౌడ సంఘ భవనంలో. . ఎండపల్లి మండలం గుల్లకోటలలో సుమారు 200 మంది గీత కార్మికులకు కాటమయ్యా రక్షణ కిట్లను విప్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆబ్కారీ సీఐ మహేందర్‌సింగ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సాయిబాబా, ఎంపీవో శ్రీనివాస్, శైలేందర్‌రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు సత్యం, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



లంబాడిపల్లెలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు

మల్యాల, న్యూస్‌టుడే: లంబాడిపల్లె, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాల్లో శుక్రవారం మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు బత్తిని మల్లీశ్వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దారు మునిందర్, ఐకేపీ ఏపీఎం రాజయ్య, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వంశీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాయికల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దారు అబ్దుల్ ఖయ్యూం అన్నారు. రాయికల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైతాపూర్, శివాజినగర్, రాయికల్ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పురపాలిక ఛైర్మన్ మోర హన్మండ్లు ప్రారంభించారు. సహకార సంఘ అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బేతి మల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు కొల్ల నారాయణ, ఖైరం రమణ, బోడ భూమరాజం, కౌన్సిలర్లు తదితరులున్నారు.

గొల్లపల్లి: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. వెన్గుమట్లలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సంతోష్, ఏపీఎం త్రివేణి పాల్గొన్నారు.

సంజయ్‌కుమార్ ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా భారాస కార్యాలయంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యుడైన సంజయ్‌కుమార్‌కు భారాస అధినేత కేసీఆర్ నమ్మి మూడుసార్లు అవకాశం ఇచ్చారని, భారాస అధికారం కోల్పోయి ఆరునెలలు తిరక్కముందే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని అభివృద్ధి కోసమే పార్టీ మారానని ప్రకటించి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరలే.. భారాసకు రాజీనామా చేయలేదని అంటున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారిన సంజయ్‌కుమార్ వెంటనే భారాసకు రాజీనామా చేయాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై తమకెంతో అభిమానం ఉందని భారాస పాలనలో రైతులు, ప్రజా సమస్యలను ఎప్పటిప్పుడు ప్రభుత్వం దృష్టికి తెచ్చారని, అభివృద్ధిపై మాట్లాడే జీవన్‌రెడ్డి ప్రస్తుతం హత్యా రాజకీయాల గురించి మాట్లాడవలసి వచ్చిందంటే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మార్కెఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పట్టణ భారాస అధ్యక్షుడు గట్టు సతీష్, పురపాలక కౌన్సిలర్ ఆవారి శివకేసరిబాబు, శీలం ప్రియాంక తదితరులున్నారు.

పశువుల సమగ్ర సమాచారం సేకరించాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: పశుగణన సందర్భంగా సమగ్ర సమాచారం సేకరించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నరేష్ అన్నారు. మెట్‌పల్లి మండలం చింతలపేటలో 21వ పశుగణన గోడప్రతులను మండల పశు వైద్యాధికారి డాక్టర్ మనీషాతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 25 వరకు జిల్లాలో పశుగణన పూర్తి చేయాలన్నారు. ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

చెగ్యాం నిర్వాసితులకు చెక్కుల పంపిణీ నేడు

వెల్గటూర్ : ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు రూ.18 కోట్ల ఇళ్ల పరిహారం చెక్కులను శనివారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఈ నెల 22న పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినప్పటికీ జగిత్యాలలో చోటుచేసుకున్న హత్య పరిణామాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. గ్రామానికి చెందిన 126 మంది నిర్వాసితుల ఇండ్లకు సంబంధించిన పరిహారం మంజూరైంది. ఈ చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్‌ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

గొల్లపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో రాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సాయిబాబా, ఏఎంసీ ఛైర్మన్ సంతోష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేత్ర వైద్య శిబిరం

కోరుట్ల: కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు 70 మంది ప్రజల కళ్లను పరీక్షించి 20 మందికి శస్త్రచికిత్స అవసరమున్నట్లు గుర్తించారు. వీరిని ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించినట్లు అధ్యక్షుడు నగునూరి గంగాధర్ గౌడ్ తెలిపారు. అశోక్, వెంకటస్వామి, నాగచంద్రప్రకాశ్, గణేష్, రాజలింగం, పోల రఘు, ధనుంజయ్, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



మధు

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మధు అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అనిత శుక్రవారం తెలిపారు. మధు జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్లో పోటీల్లో పాల్గొని సత్తాచాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని పీఈటీ రవీందర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

భాజపాకు అండగా నిలవాలి

మెట్‌పల్లి: భాజపాకు అన్ని వర్గాలు అండగా నిలవాలని పార్టీ మెట్‌పల్లి మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఇల్లెందుల శ్రీనివాస్, బోగ గంగాధర్, మెడిచెల్మెల గణేష్, రవి, సురేష్, ధర్మేందర్ తదితరులున్నారు.

పచ్చదనాన్ని పెంచడం అందరి బాధ్యత

మెట్‌పల్లి పట్టణం: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత అని బల్దియా కమిషనర్ మోహన్ సూచించారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని జాతీయ రహదారి డివైడర్‌పై మొక్కలు నాటారు. వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు అంగడి పురుషోత్తం, బంగారుకాళ్ల కిషోర్, డీఈ నాగేశ్వర్‌రావు, పుర ఉద్యోగులు విష్ణు, ముజీబ్, విజయ్, నిజాం, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపు

మెట్‌పల్లి పట్టణం: ఏళ్ల నుంచి కుక్కలతో ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలకు ఎట్టకేలకు కాస్త ఉపశమనం దొరికినట్లయింది. ప్రజల నుంచి విన్నపాలు రావడంతో స్పందించిన అధికారులు వీధులలో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని ప్రత్యేక ఆటోలో యానిమల్ బర్త్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. పట్టణంలో సుమారు 45 కుక్కలను తరలించారు.

బీటుకు అధికంగా ధాన్యం, మక్కలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు శుక్రవారం మక్కలు, ధాన్యాన్ని అధికంగా విక్రయానికి తెచ్చారు. బీటులో మక్కలకు క్వింటాలుకు రూ.1,859 నుంచి రూ.2,455, ధాన్యం జైశ్రీరాం రూ.2,550, ఎంటీయూ1010 రూ.1,875 నుంచి రూ.1,928 వరకు ధరలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి తన్నీరు రాజశేఖర్ తెలిపారు.

హైదర్‌పల్లెలో పశు వైద్యశిబిరం

జగిత్యాల వ్యవసాయం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జగిత్యాల మండలం హైదర్‌పల్లెలో శుక్రవారం పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలను ఇచ్చారు. అధికారులు కందుకూరి పూర్ణచందర్, గరిగంటి రవి, ప్రసాద్, అనిత, పంచాయతీ కార్యదర్శి కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీడీ కార్మిక సంఘం మహాసభ

మల్యాల: మల్యాల మండల కేంద్రంలో శనివారం జిల్లా స్థాయి బీడీ కార్మిక సంఘం మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొక్కుల శాంత, సుతారి రాములు తెలిపారు. శుక్రవారం మల్యాలలో సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న విశ్వనాథం, ఎం.డి ముక్రం, గంగాధర్ పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ఐపీఎస్ అధికారి

మల్యాల: కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి శివమారుతిరెడ్డి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనను శాలువాతో సత్కరించగా అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. ఔట్‌పోస్టు ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

కొడిమ్యాల: కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లె గ్రామంలో పంటల్లో వాతావరణ ఆధారిత చీడపీడల నివారణపై కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మాజీ ఉపసర్పంచి చల్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2 సంవత్సరాల పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్ఎస్ఎస్ ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులు డీఐఎఎల్‌వై, డీఈసీజీ కోర్సులకు అర్హులని బైపీసీ అభ్యర్థులు లేని పక్షంలో ఇతర గ్రూపుల అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలిస్తామని ఆసక్తిగల వారు ఈనెల 30లోగా రూ.100 చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల ధరూర్‌క్యాంపు: విద్యార్థుల కళాశాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. జగిత్యాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. లక్ష్మీనారాయణ, కె.గంగాధర్, రాంచందర్, వంశీ, మల్లీశ్వరి, రోజా పాల్గొన్నారు.

అనుమతిలేని ప్రార్థన మందిరాలపై చర్యలు తీసుకోవాలి

రాయికల్: రాయికల్ మండలం మైతాపూర్ శివారులో పలు చోట్ల అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఓ వర్గానికి చెందిన ప్రార్థన మందిరాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు శుక్రవారం కార్యదర్శి వేణుకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజనాల మధుకర్, శ్రీనివాస్, సద్ది మహిపాల్, దేశవేని శ్రీను, స్వామి, వినీత్, మధు తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడిమ్యాల: మండల కేంద్రానికి చెందిన, జేఎన్టీయూ కళాశాలలో పొరుగు సేవల ఉద్యోగి కొత్తూరి సురేందర్(47) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సురేందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మేడిపల్లి: మేడిపల్లి మండలం దమ్మన్నపేటలో బండ్ల గంగారాం ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను భారాస నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచి కాచర్ల సురేష్, అంకం సాగర్, సురేశ్ తదితరులున్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ స్వామి వారి తీర్థ ప్రసాదాన్ని విప్‌కు అందించారు.

నవంబరు 2 నుంచి గోదావరి హారతి

ధర్మపురి: ధర్మపురిలో కార్తీకమాసం సందర్భంగా వచ్చే నెల 2 నుంచి 15 వరకు గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు మేళతాళాలతో దేవస్థానం నుంచి బయలుదేరి, నదిలోని మంగళిగడ్డ ప్రాంతంలో ప్రత్యేక పూజలు చేసి, మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోరుట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు నిత్యం పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనత, పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, గంగనర్సు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల తనిఖీ



మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న డీఐఈవో వెంకటేశ్వర్లు

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈవో వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. కమ్యూనికేషన్, స్కిల్స్, రైటింగ్ స్కిల్స్ వాటిపై ఆరా తీశారు. ప్రిన్సిపల్ సత్యనారయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణం: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని డీఐఈవో వెంకటేశ్వర్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. కళాశాలలో తరగతి గదులు, రికార్డులు పరిశీలించి అధ్యాపకులకు సూచనలు చేశారు. అనంతరం కళాశాలకు అధ్యాపకుడు రాజేంద్రప్రసాద్ డిజిటల్ మైకు అందజేయగా అభినందించారు. అధ్యాపకులు తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం: కళాశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని అధ్యాపకులకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా అభ్యసించి, రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ప్రిన్సిపల్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దీపావళి ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఇందులో రెండు ఉమ్మడి జిల్లావాసులకు అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్‌-పట్నా ప్రత్యేక రైలు శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి ఆదివారం రాత్రి 7 గంటకు పట్నా చేరుకుంటుంది. తిరిగి ఆదివారం రాత్రి 9.20కి పట్నాలో బయల్దేరి మంగళవారం ఉదయం 8.30కి సికింద్రాబాద్‌ చేరుకుంటుంది. ఇదే రైలు తిరిగి నవంబరు 2, 9 తేదీల్లో పట్నా వైపు, 4, 11 తేదీల్లో సికింద్రాబాద్‌ వైపు నడుస్తుంది. మరో ప్రత్యేక రైలు లింగంపల్లిలో ఈ నెల 28న సాయంత్రం 4.45కి బయల్దేరి 30న తెల్లవారుజామున 2.30కి యూపీలోని ముజఫర్‌పూర్‌ చేరుతుంది. అదే రోజు ఉదయం 4.55కి అక్కడి నుంచి బయల్దేరి 31న రాత్రి 7 గంటలకు లింగంపల్లి చేరుకుంటుంది. ఈ రైలు నవంబరు 4, 11 తేదీల్లో ముజఫర్‌పూర్‌ వైపు, 6, 13 తేదీల్లో లింగంపల్లి వైపు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక రైళ్లకు పెద్దపల్లి, రామగుండంలో హాల్టింగ్‌ ఇచ్చారు.

5 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్‌ పరీక్షలు

కరీంనగర్‌ కలెక్టరేట్‌: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరిగే బీఈడీ రెండో సెమిస్టర్‌ (సీబీసీఎస్‌-రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌) పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్‌కు 164 ట్రాలీల విడిపత్తి

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు శుక్రవారం 164 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000, గరిష్ఠ ధర రూ.6,700 పలికింది. 44 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,800 నుంచి రూ.6,400 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు.

భద్రత కల్పిస్తూ... బాధ్యత తెలియజేస్తూ!

■ విద్యార్థులు, పౌరులకు అవగాహన
■ కొనసాగుతున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు


బాంబును నిర్వీర్యం ఎలా చేస్తారో వివరిస్తున్న నిపుణులు

న్యూస్‌టుడే, కరీంనగర్‌ నేరవార్తలు

దేశం కోసం ప్రాణాలర్పించిన త్రివిధ దళాల సైనికులు, రాష్ట్ర పోలీసులను స్మరిస్తూ.. ఏటా అక్టోబరు 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. అమరులైన వారి సేవలను ప్రతి ఒక్కరికీ గుర్తుచేలా వివిధ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు వివిధ సేవలపై వివరిస్తున్నారు.

ఆయుధాల ప్రదర్శన.. జాగిలాల విన్యాసం


■ కరీంనగర్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పరేడ్‌ మైదానంలో ఓపెన్‌ హౌజ్‌ ఏర్పాటు చేశారు. ఇందులో పోలీసు వినియోగిస్తున్న ఆయుధాలను ప్రదర్శించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఏ ఆయుధాన్ని ఎలాంటి సందర్భాల్లో వినియోగిస్తారో వివరిస్తున్నారు. నేరగాళ్లు ఒకరిగా పట్టుబడినప్పుడు, గుంపులుగా వచ్చినప్పుడు ఎలాంటి ఆయుధాలు వాడతారో తెలుపుతున్నారు.

■ పోలీసు జాగిలాల విన్యాసం అందరిని ఆకట్టుకుంటుంది. బాంబు స్క్వాడ్‌ నిపుణులు వాటిని గుర్తించే విధానాన్ని తెలియజేస్తూ.. అత్యవసర సమయంలో ఉపయోగించే గ్యాస్‌ టియర్‌, శరీర రక్షణ కవచంపై వివరిస్తున్నారు. అలాగే సైబర్‌ మోసాలపై అవగాహన కల్పిస్తున్నారు.

■ ప్రస్తుతం మహిళలు, విద్యార్థినులపై పాఠశాల, కళాశాల తదితర ప్రాంతాల్లో ఘటనలపై షీటీం బృందం లఘు చిత్రం రూపొందించి విద్యార్థుల కోసం ప్రదర్శిస్తున్నారు. కేసులు నమోదైతే జరిగే పరిణామాలను సైతం వివరిస్తున్నారు.

■ రవాణాకు సంబంధించి.. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. ఇందుకోసం పరేడ్‌ మైదానంలో ట్రాఫిక్‌ సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్‌ వినియోగంపై వీడియో రూపంలో వివరిస్తున్నారు. ప్రమాద సమయంలో డ్రైవింగ్‌ లైసెన్స్‌, బీమా, ఆర్‌సీ తదితర వెంట ఉంటే కలిగే ఫలితాలపై తెలియజేస్తున్నారు.

వ్యాసరచన, లఘుచిత్రంపై పోటీలు



వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై ఆన్‌లైన్‌ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. పోలీసు సిబ్బంది అత్యవసర సమయంలో చేసిన సాయంపై తీసిన ఫొటోలపై బహుమతులు.. వారి విధి నిర్వహణపై రూపొందించే చిత్రానికి తగిన గుర్తింపు ఇవ్వనున్నారు. వారోత్సవాల చివరి రోజు పోలీస్‌ కమిషనర్‌ బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు సైతం ఎంపిక చేయనున్నారు.

రక్తదానం.. మహాదానం

అత్యవసర పరిస్థితిలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నారు. సిబ్బందిలో స్ఫూర్తి నింపేందుకు కరీంనగర్‌ కమిషనర్‌ అభిషేక్‌ మహంతి రక్తదానం చేసి అందరిని ప్రోత్సహించారు. సుమారు 200 మంది రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు.

■ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరిలో తగ్గిపోతుంది. 'తమ చేతుల్లోనే ఆరోగ్యం' అనే నినాదంతో పోలీసుశాఖ సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వ్యక్తిగత కక్షతోనే హత్య

నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడి

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా గ్రామీణ మండలం జాబితాపూర్‌లో జరిగిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ అశోక్‌కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జాబితాపూర్‌ గ్రామానికి చెందిన సంతోష్‌ తండ్రి లచ్చన్న పెద్ద నాన్న ముత్తయ్య మధ్య భూ వివాదం ఉంది. ముత్తయ్య తరపున అదే గ్రామానికి చెందిన గంగారెడ్డి పెద్ద మనిషిగా ఉండగా వివాదం పరిష్కారం కాలేదు. అంతేగాకుండా 2020లో సంతోష్‌పై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా వచ్చే నెల 25 నుంచి ట్రయల్‌ ప్రారంభం కానుంది. ఈ కేసులో రాజీకుదిర్చేందుకు సంతోష్‌ 15 రోజుల కిందట గంగారెడ్డిని సంప్రదించగా అతను అంగీకరించకపోగా దూషించడంతో ఎలాగైనా అతనిని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. అద్దెకారు, ఒక కత్తి తెచ్చుకొని ఈనెల 22న ఉదయం 8 గంటలకు గంగారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుకనుంచి ఢీకొట్టి అదుపుతప్పి కిందపడగానే ఛాతి తదితర ప్రాంతాల్లో కత్తితో పొడిచి హతమార్చాడు. సంఘటనా స్థలంలోనే సెల్‌ఫోన్‌, కారు వదిలేసి పారిపోగా గంగారెడ్డి భార్య మారు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిపై ఇదివరకే జగిత్యాల రూరల్‌ స్టేషన్‌ పరిధిలో 3, గొల్లపల్లి స్టేషన్‌ పరిధిలో ఒక కేసు నమోదైందన్నారు. పథకం ప్రకారం హత్యకు పాల్పడ్డట్లు విచారణలో తేలిందని, ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఉందనే విషయమై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ..
ఇద్దరి దుర్మరణం


శ్రీనివాస్‌గౌడ్‌


దగ్గుల స్వామి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి మండలంలో శుక్రవారం విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన పోతుగంటి శ్రీనివాస్‌ గౌడ్‌(45) గ్రామంలో కల్లుగీత వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రాయికల్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తన మేనల్లుడు నిజామాబాద్‌ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన ఉట్నూరి నివాస్‌తో కలిసి వెల్లుల్ల మీదుగా స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మండలంలోని వెల్లుల్లకు చెందిన దగ్గుల స్వామి(55) కొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి మెట్‌పల్లి పట్టణంలో నివాసముంటున్నాడు. ఉపాధి కోసం గల్ఫ్‌ వెళ్లి సుమారు మూడేళ్ల కిందట తిరిగొచ్చి స్థానికంగా చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. వెల్లుల్లకు పని నిమిత్తం వచ్చి తల్లి, ఇతర కుటుంబ సభ్యులను కలిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి మెట్‌పల్లికి వెళ్తున్నాడు. వెల్లుల్ల శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శ్రీనివాస్‌గౌడ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామికి తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

28న పీఎఫ్‌ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్‌ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్‌ మీ ముంగిట (నిధి ఆప్కే నికట్‌) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్‌ సెల్వత్కర్‌ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
కరీంనగర్‌	తిమ్మాపూర్‌ మండలం పర్లపల్లి గ్రామం హరిత బయో ప్రొడక్ట్స్‌ ఇండియా ప్రైవేట్‌ సంస్థ
పెద్దపల్లి	సుల్తానాబాద్‌ రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ భవనం
జగిత్యాల	విద్యానగర్‌ మెప్మా సమావేశ గది
సిరిసిల్ల	వేములవాడ మున్సిపల్‌ కార్యాలయం

29న ఎంపిక పోటీలు

కరీంనగర్‌ క్రీడా విభాగం: కొత్తపల్లి అకాడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ పాఠశాలలో ఈ నెల 29న ఉమ్మడి జిల్లా సబ్‌ జూనియర్స్‌ హ్యాండ్‌బాల్‌ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్‌ బాధ్యులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌ తెలిపారు.

గుట్టను తొలిచి.. నిర్మాణంగా మలచి



ఈనాడు, సిరిసిల్ల: జిల్లాలో అదో మారుమూల తండా. చుట్టూ అటవీ ప్రాంతం. నివాస గృహాలకు స్థలాలు తక్కువ. అలాంటిది పంచాయతీ భవన నిర్మాణం కష్టం. దీనికి తండా వాసులంతా ఆలోచనలో పడ్డారు. చివరికి వారు ఉంటున్న గుట్టను తొలిచి రూ.20 లక్షలతో భవనం నిర్మించారు. ఇదే అడ్డబోరు తండా పంచాయతీ. ఇదే కాకుండా క్రీడా మైదానం, సేవాలాల్‌ ఆలయం నిర్మించేందుకు మరింత స్థలం చదును చేశారు. ఈ పంచాయతీ భవనం మానాలలోని ఏ తండా నుంచి చూసినా ఎత్తులో కనిపిస్తుంది. వీరి ఐకమత్యం చూసి చుట్టుపక్కల వారు ఔరా అంటున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌ మృతి


వినయ్‌


పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌ గ్రామానికి చెందిన గుండా వినయ్‌(25) విద్యుదాఘాతంతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న వినయ్‌ శుక్రవారం గ్రామంలోని ఎమ్మార్పీ ఇటుక బట్టీలో విద్యుత్తు తీగలు సరి చేయడానికి వెళ్లారు. నిచ్చెనపైకి ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు బసంత్‌నగర్‌ ఎస్సై స్వామి తెలిపారు.

ఉడుం పట్టు.. అదిరేట్టు!

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన కుస్తీ వీరులు

న్యూస్‌టుడే, కరీంనగర్‌ క్రీడా విభాగం

గత అయిదు ఒలింపిక్స్‌లో మన దేశానికి పతకం తెచ్చిన క్రీడల్లో కుస్తీ(రెజ్లింగ్‌) ఒకటి. ఈ క్రీడలో రాణించాలంటే శరీర బలంతోపాటు గుండె ధైర్యం కూడా ఉండాలి. తక్కువ సమయంలో ప్రత్యర్థిని పట్టుబట్టి పాయింట్లు రాబట్టాలి. 2012లో కరీంనగర్‌కు కుస్తీ కోచ్‌ రావడం, జాతీయ స్థాయి ప్రమాణాలున్న మ్యాట్‌ చొప్పదండి మండలం రుక్మాపూర్‌ క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేయడంతో జిల్లాలో కుస్తీకి ఆదరణ పెరిగింది. 2020 వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్‌ క్రీడాకారులు ఛాంపియన్లుగా నిలిచారు. కోచ్‌ బదిలీ కావడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ క్రీడకు కొంత ఆదరణ తగ్గినా.. ఆటపై ఉన్న మక్కువతో క్రీడాకారులు మళ్లీ పుంజుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌) రాష్ట్ర స్థాయి అండర్‌-19 పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులపై 'న్యూస్‌టుడే' కథనం.


రాష్ట్ర స్థాయి అండర్‌-19 కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఏడాది శిక్షణలో రెండు పతకాలు




ఉప్పలయ్య-నాగమణిల కుమారుడు తిప్పర్తి సిద్ధార్థ రుక్మాపూర్‌ సైనిక్‌ పాఠశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి మ్యాట్‌ ఏర్పాటు చేసి.. మెరుగైన శిక్షణ ఇవ్వడంతో ఏడాది నుంచి శిక్షణ పొందుతున్నాడు. 2024లో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ అండర్‌-19 పోటీల్లో బంగారు పతకం.. రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించాడు.

బంగారు పతకమే లక్ష్యం



గుండియా నాయక్‌-సుశీల దంపతుల కుమారుడు దినేష్‌ చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని సైనిక్‌ పాఠశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో కోచ్‌ వంశీకృష్ణ సారథ్యంలో ఏడాది నుంచి కుస్తీ సాధన చేస్తున్నాడు. 2023లో రెజ్లింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అండర్‌-17 పోటీల్లో కాంస్యం, హనుమకొండలో జరిగిన ఎస్జీఎఫ్‌ పోటీల్లో రజతం, 2024లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ అండర్‌-19 పోటీల్లో కాంస్య పతకాలు సాధించాడు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని దినేష్‌ చెబుతున్నాడు.

సైన్యంలో చేరాలని..



వ్యవసాయ కుటుంబానికి చెందిన గంగారాం-సావిత్రిబాయిల కుమారుడు కె.రాజరత్నం రెండేళ్ల నుంచి కుస్తీలో శిక్షణ పొందుతున్నాడు. 2023లో ఉట్నూర్‌లో.. 2024లో హైదరాబాద్‌లో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, ఆదిలాబాద్‌లో జరిగిన సాంఘిక సంక్షేమ సొసైటీ పోటీల్లో రజత పతకం పట్టుకొచ్చాడు. సైన్యంలో చేరి కుస్తీలో అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రజరత్నం తెలిపాడు.

రవి దహియా స్ఫూర్తితో..



పి.బిక్కుసింగ్‌, మీరాబాయిల కుమారుడు విజయ్‌కుమార్‌ 2020 ఒలింపిక్స్‌లో కుస్తీ పోటీల్లో పతకం సాధించిన రవికుమార్‌ దహియా స్ఫూర్తితో రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. సాధన మొదలుపెట్టిన కొన్ని రోజుల్లోనే పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2023 ఆదిలాబాద్‌లో.. 2024 హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, సాంఘిక సంక్షేమ సంఘం పోటీల్లో రజత పతకం గెలుచుకున్నాడు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిప్లొమా కోర్సులు

తీరనున్న సిబ్బంది కొరత.. రోగులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన 28 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పారామెడికల్‌ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండేసి డిప్లొమా కోర్సుల నిర్వహణకు శాఖాపరమైన అనుమతులు ఇస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలకు ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున రెండు కోర్సుల్లో 60 సీట్లను కేటాయించింది. కరీంనగర్‌, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలోని వైద్య కళాశాలల్లో మొత్తం 1,680 మంది విద్యార్థులు పారామెడికల్‌ డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చు. ప్రవేశాల ప్రక్రియ కళాశాల ప్రిన్సిపల్‌లు నిర్వహించనుండగా.. తరగతులను ఆయా కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాసుపత్రుల్లోనే నిర్వహించనున్నారు.

వైద్య కళాశాల	కోర్సులు
కరీంనగర్‌	అనస్థీషియా టెక్నీషియన్‌ మెడికల్‌ ఇమేజింగ్‌ టెక్నీషియన్‌
జగిత్యాల	డయాలసిస్‌ టెక్నీషియన్‌ ఈసీజీ టెక్నీషియన్‌
రామగుండం	డయాలసిస్‌ టెక్నీషియన్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌
రాజన్న సిరిసిల్లా	అనస్థీషియా టెక్నీషియన్‌ ఈసీజీ టెక్నీషియన్‌

వైద్య సేవల్లో కీలకం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం, అవసరమైన సహాయ సహకారాలు, వైద్య పరీక్షలు నిర్వహించడంలో పారామెడికల్‌ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. అనుబంధ ఆస్పత్రుల్లో కూడా సిబ్బంది కొరత తీరనుంది. ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందనున్నాయి. ల్యాబ్‌ టెక్నీషియన్‌, ఈసీజీ, డయాలసిస్‌, రేడియో థెరపీ, డెంటల్‌, ఆప్తామాలజీ టెక్నీషియన్‌ తదితర 21 రకాల పారామెడికల్‌ కోర్సులను నూతన వైద్య కళాశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఔత్సాహిక విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల్లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి.

అర్హతలు: ఇంటర్మీడియట్‌ చేసిన వారు అర్హులు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. డిప్లొమా ఇన్‌ రేడియో థెరపీ టెక్నీషియన్‌ మాత్రం తప్పనిసరిగా బైపీసీ లేదా ఎంపీసీలో ఇంటర్మీడియట్‌ పూర్తి చేసి ఉండాలి.

కోర్సు కాలపరిమితి: రెండు సంవత్సరాలు

ముఖ్యమైనా తేదీలు

అక్టోబర్‌ 30 : దరఖాస్తుల సమర్పణకు తుది గడువు.

నవంబర్‌ 13 : సీట్ల కౌన్సెలింగ్‌.. కేటాయింపునకు..

నవంబర్‌ 20 : ఎంపికైనా విద్యార్థుల వివరాలను పారామెడికల్‌ బోర్డునకు సమర్పణకు

నవంబర్‌ 22 : కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలు పారామెడికల్‌ బోర్డుకు పంపించడానికి

నవంబర్‌ 25 : తరగతుల ప్రారంభం

ఉద్యోగ, ఉపాధికి భద్రత

పారామెడికల్‌ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి భద్రత ఉంటుంది. అర్హులైన ఔత్సాహికులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలకు 93983 08078 నంబర్‌ ద్వారా చరవాణిలో సంప్రదించాలి.

- డాక్టర్‌ హిమబిందుసింగ్‌, ప్రిన్సిపల్‌, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని



ఇసుక మాయం.. ముళ్ల పొదలు దర్శనం

ఈ చిత్రంలో కనిపిస్తున్న ముళ్ల పొదలు సాక్షాత్తు వేములవాడ మూలవాగులోనివి. గత కొన్ని సంవత్సరాలుగా ఏటా అక్రమార్కులు ఇసుకను పూర్తిగా తోడేయడంతో అడుగులోతులో మట్టి మిగిలింది. దీంతో వేములవాడ మూలవాగులో ఇసుక మాయమై ఇలా ముళ్ల పొదలు పెరిగి దర్శనమిస్తున్నాయి. ఇది ఒకప్పుడు పూర్తిగా ఇసుకతో దర్శనమిచ్చేది. అలాంటిది ప్రస్తుతం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. **- న్యూస్‌టుడే, వేములవాడ**

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపిక


అన్వేష్‌

కరీంనగర్‌ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ ఫొటోగ్రఫీలో రూపొందించిన సినిమా 'మోనిహార' అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపికైంది. కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఈ విషయాన్ని శుక్రవారం ప్రకటించింది. భారత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వేడుక 2024 నవంబరు 20 నుంచి 28 వరకు గోవాలో జరుగుతుంది. విశ్వనాథ్‌ ఠాగూర్‌ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. కోల్‌కత్తా సత్యజిత్‌ రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో సినిమాటోగ్రఫీ పూర్తి చేసిన వారాల అన్వేష్‌ ప్రస్తుతం హైదరాబాద్‌ సినిమా రంగంలో పని చేస్తున్నారు. గతంలో పలు చిత్రాలకు పని చేసిన ఈయన ఇండో బంగ్లాదేశ్‌ లఘు చిత్ర ఫెస్టివల్స్‌తోపాటు పలు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకున్నారు.